పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
పోరు తెలంగాణ
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న
పోరు తెలంగాణ తెలుగు పత్రికకు జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారిగా ఆర్.సి. ఇంచార్జీలు
మండలాల వారిగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది.
R.N.I. No. TEL TEL/2014/57720
PORU TELANGANA Telugu Daily
పోరు తెలంగాణ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9440019875, 8555918136

కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 25-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ



- అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్
- వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
- అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం - మిగతా 2 లో

## సీఐఐ ప్రతినిధుల సమావేశం
## చంద్రబాబును గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం సురక్షితమన్న రేవంత్ రెడ్డి
- గత ప్రభుత్వాల మంచి విధానాలను కొనసాగిస్తామన్న ముఖ్యమంత్రి
- చంద్రబాబు, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తావన
- రాష్ట్రానికి 3 బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, 2 కొత్త ఎయిర్‌పోర్టులు
- అమెజాన్, అదానీ గ్రూపుల భారీ పెట్టుబడుల వెల్లడి




పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నార్తర్న్ రీజనల్ కౌన్సిల్

## వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు



- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని - మిగతా 2 లో

# భోగాపురం విమానాశ్రయం
# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

- ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం: ప్రధాని మోదీ
- ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ




పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు

## నాడు ఎమర్జెన్సీకి ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు

సంచలన లేఖలను బయటపెట్టిన జైరాం రమేశ్



- ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతిచ్చిందని జైరాం రమేశ్ వాదన
- ఆధారంగా 1975 నాటి ఆర్ఎస్ఎస్ చీఫ్ దేవరస్ లేఖల సమర్పణ
- ఇందిరా గాంధీకి దేవరస్ శుభాకాంక్షలు తెలిపినట్టు లేఖల్లో వెల్లడి
- జేపీ ఉద్యమంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేసిన ఆర్ఎస్ఎస్

దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ)కి రాష్ట్రీయ స్వయంసేవక్ - మిగతా 2 లో

## నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం



- నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం - మిగతా 2 లో

## ఇరాన్‌పై మరోసారి యుద్ధ మేఘాలు

- ఈ వారాంతంలోనే భయానక దాడులకు వైట్‌హౌస్ సన్నాహాలు!
- బాంబు దాడులు చేసే దిశగా సంకేతాలు ఇచ్చిన ట్రంప్
- చాలా తీవ్రమైన దాడులు చేయబోతున్నట్టు ప్రకటన
- దాడులకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించిన అమెరికా బలగాలు



పశ్చిమాసియాలో మరోసారి భారీ యుద్ధ జ్వాలలు రగులుకునే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై ఈ వారాంతంలోనే అత్యంత తీవ్రస్థాయిలో వైమానిక, బాంబు దాడులకు దిగేందుకు సిద్ధమవుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. ఇరాన్ వైఖరిపై తీవ్ర - మిగతా 2 లో

## పీవోకేలో పాక్ దమనకాండ నాలుగు రోజుల్లో 50 మందికిపైగా మృతి

- పీవోకేలో నాలుగు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు
- భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా మృతి
- వందలాది మంది గాయపడ్డారని పౌర సంఘాల ఆరోపణ
- హెచ్ఆర్ఎఫ్ తీవ్ర ఖండన
- ఇంటర్నెట్, మీడియాపై ఆంక్షలు
- ఐరాసను ఆశ్రయించిన యూకేపీఎన్‌పీ ప్రతినిధులు



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనలపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కఠినంగా వ్యవహరించడంతో 50 మందికిపైగా మరణించారు. వందలాది - మిగతా 2 లో

## శభాష్ లోకేశ్ భుజం తట్టిన ప్రధాని మోదీ



- మంత్రి నారా లోకేశ్‌ను ప్రశంసించిన ప్రధాని మోదీ
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం తర్వాత ఘటన
- "శభాష్, బాగా పనిచేస్తున్నావు" అంటూ భుజం తట్టిన ప్రధాని
- ఇదే స్ఫూర్తితో పనిచేయాలని లోకేశ్‌కు సూచన
- గతంలోనూ లోకేశ్ కృషిని మెచ్చుకున్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ పనితీరును - మిగతా 2 లో

## భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్ వైసీపీ ఆసక్తికర ట్వీట్




- ప్రాజెక్టుకు పునాది వేసింది జగనే అన్న వైసీపీ
- అన్ని అనుమతులు జగన్ హయాంలోనే సాధించామని వెల్లడి
- ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర లేదన్న వైసీపీ

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఇవాళ ప్రధాని మోదీ చేతుల మీదుగా - మిగతా 2 లో

# భోగాపురం ఎయిర్‌పోర్టు
# ఉత్తరాంధ్రకు మణిహారం

- సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు
- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్టు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ




భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

మొదటిపేజీ తరువాయి – సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

# వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

మొదటిపేజీ తరువాయి – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# సీఐఐ ప్రతినిధుల సమావేశం

మొదటిపేజీ తరువాయి – ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "నాయకులు, పార్టీలు మారవచ్చు కానీ, గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను మేం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను హైదరాబాద్‌కు రప్పించి పెట్టుబడులను ఆకర్షించిన తీరును ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలోనే అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వంటి ప్రాజెక్టులు సాకారమయ్యాయని తద్వారా ఫార్మా ఐటీ రంగాలు మరింత విస్తరించాయని తెలిపారు. తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని, తయారీ రంగంలో చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరాల పరంగా టోక్యో, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నామని ఆయన అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు (శంషాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరు) తెలంగాణకు రానున్నాయని వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలివస్తున్నాయని, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు సుమారు 200 కంపెనీలు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. డేటా సెంటర్ల స్థాపన కోసం అమెజాన్ సంస్థ రూ.1 లక్ష కోట్లు, అదానీ గ్రూప్ రూ.35,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలను తీసుకురావడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# శభాష్ లోకేశ్.. భుజం తట్టిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి – ప్రశంసించారు. "శభాష్ లోకేశ్, చాలా బాగా పనిచేస్తున్నావు" అంటూ ఆయన భుజం తట్టి అభినందించారు. ఇదే వేగం, స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని లోకేశ్‌కు సూచించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళుతున్న ప్రధాని మోదీకి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని ఆప్యాయంగా లోకేశ్‌తో మాట్లాడి, ఆయన పనితీరుపై ప్రశంసలు కురిపించారు. గతంలో ఏపీలో ప్రధాని మోదీ పర్యటనలను విజయవంతం చేయడంలో, అలాగే 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా రికార్డు సాధించడంలో లోకేశ్ చూపిన చొరవను ప్రధాని అప్పట్లోనూ మెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి లోకేశ్ పనితీరుపై ప్రధాని బహిరంగంగా ప్రశంసలు కురిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ഠ

# భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్ వైసీపీ ఆసక్తికర ట్వీట్

మొదటిపేజీ తరువాయి – ప్రారంభమయింది. మరోవైపు, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంపై వైసీపీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టు సాకారమవ్వడంపై మాజీ సీఎం జగన్ తరఫున ప్రజలకు వైసీపీ ధన్యవాదాలు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు పునాది వేసి, కల నుంచి నిజం దిశగా నడిపించిన నాయకుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నాయకులు ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం క్రెడిట్ వారి ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయపడుతున్నారని తీవ్రంగా ఆరోపించింది. జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.1,200 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో తమ ప్రభుత్వమే ముందడుగు వేసిందని స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కీలక పర్యావరణ, విమానయాన అనుమతులను జగన్ హయాంలోనే వేగవంతంగా సాధించామని తెలిపింది. ఎయిర్‌పోర్టు అనుసంధానతకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నాటి జగన్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర ఏమీ లేదని విమర్శించింది.

# నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం



మొదటిపేజీ తరువాయి – ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది. నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్‌టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్ట్రే వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్‌టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం

ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# నాడు ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతు

మొదటిపేజీ తరువాయి – సంఘ్ (ఆర్ఎస్ఎస్) మద్దతు తెలిపిందన్న తన వాదనను నిరూపించేందుకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ రాజ్యసభలో కీలక ఆధారాలను సమర్పించారు. 1975లో నాటి ఆర్ఎస్ఎస్ అధినేత బాలసాహెబ్ దేవరస్ రాసిన మూడు లేఖలను ఆయన శుక్రవారం సభాపతికి అందజేశారు. ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతునిచ్చిందనడానికి ఆధారాలు చూపాలని బీజేపీ ఎంపీలు గురువారం విసిరిన సవాలుకు సమాధానంగా జైరాం రమేశ్ ఈ చర్య తీసుకున్నారు. ఈ లేఖలను చారిత్రక ఆధారాలుగా జైరాం రమేశ్ పేర్కొన్నారు. వీటిలో రెండు లేఖలను దేవరస్ నాటి ప్రధాని ఇందిరా గాంధీకి రాయగా, మరొకటి ఆచార్య వినోబా భావేకి రాశారు. 1975 ఆగస్టు 22న ఇందిరా గాంధీకి రాసిన లేఖలో, ఆమె చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం "సమయోచితంగా, సమతుల్యంగా ఉంది" అని దేవరస్ ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ, దేశాభివృద్ధిలో తమ సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1975 నవంబర్ 10న రాసిన మరో లేఖలో, ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సంస్థపై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని మరోసారి కోరారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భాగస్వాములు అయ్యేలా, ప్రధానికి తమపై ఉన్న అపోహలను తొలగించాలని వినోబా భావేను ఆయన కోరారు.

# భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

మొదటిపేజీ తరువాయి – అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఇరాన్‌పై మరోసారి యుద్ధ మేఘాలు



మొదటిపేజీ తరువాయి – అసహనం వ్యక్తం చేసిన ట్రంప్, వారిని పూర్తిగా లొంగదీసుకునేంత వరకు తమ సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. క్యాంప్ డేవిడ్‌లోని ప్రెసిడెన్షియల్ రిట్రీట్‌లో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. "మేము వారిపై చాలా తీవ్రంగా దాడి చేయబోతున్నాం. ఇక ఈ దెబ్బలను మేం తట్టుకోలేము అని ఇరాన్ చెప్పే స్థాయి వరకు ఈ దాడుల తీవ్రత ఉంటుంది" అని ప్రకటించారు. ఇరాన్ నిరంతరం అబద్ధాలు చెబుతూ, నిబంధనలను తప్పుగా చిత్రీకరిస్తోందని, అందుకే వారిపై తనకు నమ్మకం పోయిందని ఆయన వ్యాఖ్యానించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌లోని ప్రముఖ ఇంధన మౌలిక సదుపాయాలు, చమురు శుద్ధి కర్మాగారాలే లక్ష్యంగా విరుచుకుపడటానికి ప్రణాళికలు రచించాయి. ఇప్పటివరకు జరిగిన దాడుల కంటే ఇది అత్యంత దారుణమైన ప్రచారంగా ఉండబోతోందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సోమవారం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మార్కెట్లు తెరుచుకునే సమయానికే ఈ వినాశకర దాడులను ముగించాలని అధికారులు యోచిస్తున్నప్పటికీ, దాడుల తుది గడువుపై ఎలాంటి స్పష్టత లేదు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ దళాలు దాడులకు పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. అయితే, అధికారికంగా బాంబింగ్ ప్రారంభించేందుకు ట్రంప్ నుంచి ఆఖరి ఉత్తర్వు వెలువడాల్సి ఉంది. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఉద్రిక్తతల మధ్య, ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేసి గ్లోబల్ ఆయిల్ రవాణాను అడ్డుకోవడం, ప్రతీకారంగా అమెరికా-ఇజ్రాయెల్ బలగాలు విరుచుకుపడటంతో మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వైట్‌హౌస్ వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ అణు సామర్థ్యాన్ని అంతమొందించడమే లక్ష్యంగా అమెరికా ఈ నిర్ణయాత్మక పోరుకు సిద్ధమవుతోంది.

# పీవోకేలో పాక్ దమనకాండ నాలుగు రోజుల్లో 50 మందికిపైగా మృతి



మొదటిపేజీ తరువాయి – మంది గాయపడినట్లు స్థానిక సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) సభ్యుడు సర్దార్ ఉమర్ నజీర్ కశ్మీరీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ, గత నాలుగు రోజుల్లో భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ముజఫరాబాద్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు నిరసనలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు తమ మౌలిక హక్కుల పరిరక్షణతో పాటు స్థానిక అధికారులు ఇచ్చిన హామీల అమలును కోరుతున్నారని జేఏఏసీ వెల్లడించింది. అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ (హెచ్ఆర్ఎఫ్) కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. నిరాయుధ, శాంతియుత నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. స్థానిక పౌరసమాజ సంస్థల సమాచారం ప్రకారం.. ఆధారాలు దాచిపెట్టేందుకు ఆసుపత్రుల నుంచి మృతదేహాలను తొలగించడంతో పాటు ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం వల్ల స్వతంత్ర సమాచారం బయటకు రావడం కష్టంగా మారిందని తెలిపింది. మరోవైపు యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (యూకేపీఎన్‌పీ) ప్రతినిధి బృందం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో అధికారులను కలిసి పీవోకేలో జరుగుతున్న పరిణామాలను వివరించింది. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగాన్ని వెంటనే నిలిపివేయాలని, మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలని, అదృశ్యమైన వారిపై వివరాలు వెల్లడించాలని పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేసింది.

# జెర్సీ మారినా దేశ ఆత్మ మారదు

మొదటిపేజీ తరువాయి – కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్కిన్హా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ కోసం ప్రకటించిన కొత్త జెర్సీపై భారత హాకీ మాజీ కెప్టెన్ విరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత హాకీ అంటే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది నీలం జెర్సీయేనని చెప్పారు. తాను ఎన్నో ఏళ్లు దాన్నే ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించానని గుర్తుచేశారు. అభిమానుల మనసుల్లో ఆ రంగుకే ప్రత్యేక స్థానం ఉందని, అలాంటప్పుడు కాషాయ రంగును ఎందుకు ఎంచుకున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. రస్కిన్హా వ్యాఖ్యల తర్వాత హాకీ ఇండియా కొత్త జెర్సీ రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా ఎంచుకున్నట్లు తెలిపింది. భారత జాతీయ పతాకం, ఉదయించే సూర్యుడి స్ఫూర్తితో ఈ రంగును తీసుకున్నామని పేర్కొంది. అశోక చక్రాన్ని గుర్తు చేసే నేవీ బ్లూ అంచులు, మండల కళారూపాలు, సుదర్శన చక్రం స్ఫూర్తితో రూపొందించిన డిజైన్ భారత సంస్కృతి, ఐక్యత, పురోగతిని ప్రతిబింబిస్తుందని వెల్లడించింది. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' భావనకు అనుగుణంగానే ఈ జెర్సీని రూపొందించినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

# ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు మళ్లీ భగ్గుమన్న ఉద్రిక్తతలు

మొదటిపేజీ తరువాయి – ఇది మరో కీలక పరిణామం. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8 గంటలకు ఇరాన్‌పై దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. "పశ్చిమాసియాలోని అమెరికా బలగాలపై ఇరాన్ చేసిన దాడి ప్రయత్నానికి ఇది గట్టి సమాధానం" అని సెంట్‌కామ్ పేర్కొంది. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన 24 గంటల్లోపే ఈ దాడులు జరగడం గమనార్హం. అయితే, ఇరాన్ క్షిపణులను తమ వాయు రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని అమెరికా అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన వెంటనే స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను "చాలా గట్టిగా దెబ్బతీస్తామని" హెచ్చరించారు. అమెరికా దాడుల తీవ్రత, లక్ష్యాల వివరాలను సెంట్‌కామ్ వెల్లడించనప్పటికీ, ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు అక్కడి ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ముఖ్యంగా దక్షిణ ప్రావిన్సులైన హార్మోజ్‌గాన్, ఖుజెస్థాన్‌తో పాటు పర్షియన్ గల్ఫ్‌లోని కొన్ని దీవులపై దాడులు జరిగినట్లు పేర్కొంది. క్వెష్మ్ ద్వీపంలోని నివాస ప్రాంతాలపై దాడులు జరగడంతో శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష దాడులకు విరామం లభించగా, తాజా ఘటనతో సైనిక చర్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. దౌత్యపరమైన ప్రయత్నాలు మరోసారి విఫలమైనట్లు ఈ పరిణామం సూచిస్తోంది. అమెరికా సైన్యం దూకుడు చర్యలకు ప్రతిస్పందనగానే తాము దాడి చేశామని ఇరాన్ గతంలో పేర్కొంది. మరోవైపు, సైనిక దాడులతో పాటు ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కూడా కఠినతరం చేస్తున్నట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. నౌకలను దారి మళ్లించామని, రెండు నౌకలను నిలిపివేశామని, మరో రెండు నౌకలను తనిఖీ చేశామని సెంట్‌కామ్ తెలిపింది. సైనిక, ఆర్థిక, నావికాపరమైన ఒత్తిడి ద్వారా టెహ్రాన్‌ను కట్టడి చేయాలన్న అమెరికా వ్యూహంలో భాగంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయి.

## నూతనంగా యూట్యూబ్ ఛానెల్ ప్రారంభం చేయాలి అనుకుంటున్నారా వెంటనే సంప్రదించండి





మీకు నచ్చిన విధంగా యూట్యూబ్ ఛానల్ క్రియేట్ చేసి ఇవ్వబడును మరింత క్వాలిటీ తో పాటు ఎప్పటికీ అప్పుడు అప్డేట్ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం.... డైలీ యాంకర్ పార్ట్ తో వార్తలు ఎప్పటికీ అప్పుడు తాజాగా మెరుగైన క్వాలిటీ లో మీ యొక ఛానెల్ ను పబ్లిక్ లోకి వేగంగా ముందుకి తీసుకువెళ్తాం... డైలీ యాంకర్ పార్ట్ తో వార్తలు ఎప్పటికీ అప్పుడు అప్డేట్ ఇస్తాం అని సర్వీసెస్ అవాలిబుల్ లో అతి తక్కువ ధరకే అందుబాటులో లభిస్తుంది...లి మరిన్ని వివరాలకు సంప్రదించండి:7815803937


## ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో 300 గ్రాముల గంజాయి పట్టివేత




**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో గంజాయి విక్రయానికి వచ్చిన బీహార్‌కు చెందిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 300 గ్రాముల ఎండు గంజాయితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాలు, డీఎస్పీ రాములు సూచనల మేరకు సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్సై నవీన్ కుమార్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయితో వచ్చిన యువకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యువత గంజాయి విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

### యుపిఎస్ పాఠశాల స్కావెంజర్

## వేతనాలపై ప్రజావాణిలో ఫిర్యాదు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలో ప్రజావాణి అధికారులకు యు పి ఎస్ పాఠశాల స్కావెంజర్ వేతనాల గురించి నాగపూర్ గ్రామ సర్పంచ్ పోలేపల్లి హేమలత,లక్ష్మీనారాయణ వినతి పత్రం అందజేశారు.2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కావెంజర్ గ్రాంట్ మండలంలోని అన్ని పాఠశాలలకు ఏప్రిల్ 2026 వరకు వచ్చాయని,నాగపూర్ పాఠశాలకు సెప్టెంబర్ 25 నుండి ఏప్రిల్ 2026 వరకు 8 నెలల కాలానికి స్కావెంజర్ గ్రాంట్ రాలేదని తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత గ్రాంటు ను మంజూరు చేయవలసిందిగా కలెక్టర్ కు సమాచారం అందించాలని అధికారులను కోరారు.

### ముప్కాల్ మండల కేంద్రంలో

## ప్రజావాణి కి 6 దరఖాస్తులు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండల కేంద్రంలో ప్రజావాణికి ఆరు దరఖాస్తులు నమోదయ్యాయి.మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నోడల్ అధికారి ఎంపీడీవో బి రమేష్, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 6 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖ 4, ఎలక్ట్రిసిటీ 1, ఎం పీ ఓ పంచాయతీ రాజ్ 1,దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.ఈ సమస్యలను తొందరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కిసాన్ నగర్ లో బస్సులు ఆపాలని డి యం ను కలిసిన గ్రామస్తులు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని రెండు స్టేజీలలో అన్ని ఎక్స్ప్రెస్ బస్సులు ఆపాలని గ్రామస్తులు సోమవారం నిజామాబాద్ 2 డిపో మేనేజర్ జిసిసిఎఫ్ రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్పంచ్ రామరాజు గౌడ్, ఉప సర్పంచ్ స్వామి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొండా అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమై నిజామాబాద్ వచ్చి డిఎం ను కలసి వినతిపత్రం సమర్పించారు. నిజామాబాద్ కు చెందిన రెండు డిపోల బస్సులతోపాటు నిర్మల్ డిపో బస్సులను ఆపాలని కోరారు. డి ఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. గ్రామపంచాయతీ సభ్యులు హమీద్, చిన్న దాస్, సుమలత శ్రీనివాస్, ఖాలీద్, వాహెద్, అక్బర్, ప్రసాద్ రావు,వీడీసీ సభ్యులు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

### అఖిల గాండ్ల తెలికుల సంఘం 985/2014

# తెలంగాణ రాష్ట్ర నూతన కమిటి ప్రమాణ స్వీకారం








గాండ్ల కులాన్ని గుర్తించాలి.
ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
ప్రభుత్వానికి గాండ్ల అధ్యక్షుడు ఆసోల్ల రాజేందర్ వినతి.

**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 24 :** అఖిల గాండ్ల తేలికుల సంఘం 985/2014 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జిల్లాల నలుమూలల నుండి అధిక సంఖ్యలో విచ్చేసి, ఈ కార్యక్రమాని విజయవంతంగా నిర్వహించారు అని కార్యవర్గ అధ్యక్షుడు తెలిపారు, మాజీ సంఘం అధ్యక్షుడు బికుమల్ల రామచంద్రరావు, లక్ష్మణ్ పాత కమిటీ వారందరికీ సన్మానం చేసి, కొత్త కమిటీని ఆహ్వానించి ఎన్నికైన వారికి ఎలక్షన్ ఆఫీసర్,సంగంకి ఎన్నికైన పదవి పత్రం అందజేసే సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సంఘం అధ్యక్షునిగా ఆసోల్ల రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆమనగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోసరి సురేష్, బొల్లం సత్తయ్య, మొత్తం సభ్యులతో కూడిన సంఘం ఏర్పాటు చేసుకున్నామని, నూతన సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ కులవృత్తికి దూరమైనవి జీవిస్తున్న గాండ్ల కులస్తులకు జీవనోపాధి కొరకై గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. కోకాపేటలో గత ప్రభుత్వం సంఘ భవన నిర్మాణాలకు భూమిని కేటాయించి ఇచ్చిన విషయం గుర్తు చేస్తూ భవన నిర్మాణానికి తక్షణమేనిధులు ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి దేవాలయాలకు దీపారాధనకు గానుగ నూనెలు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ మీద గానుగ లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారులు,సభ్యులు, గానుగ కులస్తులందరూ పాల్గొన్నారు.

## చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులు అరెస్ట్

**కొత్తగూడెం ఆగస్టు 24 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి చర్మం మరియు గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు విశ్వసనీయ సమాచారం మేరకు, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఈ నాగ బిక్షం, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో తేది:24.08.2026 ఉదయం సమయంలో తాళ్లగొమ్మూరు గ్రామం అనిల్ అనే వ్యక్తి ఇంటి వద్ద, ఒక చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితులు గత సంవత్సరం వేసవి కాలంలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలు తో కొట్టి మరియు భాణాలు విసిరి చంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం మరియు గోర్లను తొలగించి,




చర్మాన్ని ఎండబెట్టి, గోర్లను భద్రపరిచి ఉంచినట్లు వెల్లడించారు తరువాత చిరుతపులి చర్మం మరియు గోర్లను విక్రయించి డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ అనే వ్యక్తి భూమిని కౌలుకు తీసుకునే వ్యవసాయం చేయుట కొరకు గమ్మలకోట గ్రామం,చింతూరు మండలం కు చెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్ కుమార్ కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్పడంతో, కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు మరియు మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం మరియు గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకువచ్చారు.ఈ క్రమంలో చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి చిరుతపులి చర్మం మరియు (17) గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు

**పట్టుబడిన ముద్దాయిల కోర్టుకు రిమాండ్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు**

ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమంత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బన్సీదర్, కౌసల్య భాయ్ లాహోటి స్మారకార్థముగా చెన్నూరు లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం

**పోరుతెలంగాణ ప్రతినిధి చెన్నూరు::** 45 మంది కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి ఆసుపత్రికి తరలింపు తేది.24.08.2026 సోమవారం నాడు చెన్నూరు లయన్స్ క్లబ్ కరీంనగర్ లోని రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల సౌజన్యంతో, వైస్ చైర్మన్ లయన్ చిదురా సురేష్ సహకారంతో చెన్నూరు లోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో ఉచిత నేత్ర వైద్య శిభిరం నిర్వహించగా 65 బి పి,షుగర్, కంటి పరీక్షల అనంతరం 45 మంది కంటి ఆపరేషన్ కోసం అర్హత సాధించినట్లు రేకుర్తి ప్రతినిధి ప్రభాకర్ మరియు చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ ప్రకటించారు.నేడు రేకుర్తి ఆసుపత్రి బస్సు ద్వారా ఉచిత ప్రయాణంతో రేకుర్తి చేరుకుంటారు.రేపు కంటి ఆపరేషన్స్ అవుతాయి.బుధవారం నాడు చెన్నూరుకు తిరిగి వస్తారని చెన్నూరు క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ తెలిపారు. చెన్నూరులో జరిగిన ఉచిత కంటి శిభిరం నిర్వహణ అయిన ఖర్చును చెన్నూరు ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ లాల్ లహోటి సోదరుడు డాక్టర్ ఓం లహోటి అమ్మ నాన్న






కీర్తిశేషులు బాన్సిదర్ లహోటి కౌసల్య బాయిలహోటి లాహోటి జ్ఞాపకార్థం సుమారు 15,000 రూపాయలు స్పాన్సర్ చేసినందుకు క్లబ్ అధ్యక్షులు లయన్ నిమ్మల సాగర్ మరియు జోన్ చైర్ పర్సన్ లయన్ జాడి తిరుపతి ప్రత్యేకంగా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ప్రముఖ వైద్యులు శంకర్ లాల్ లాహోటి, జోన్ చైర్ పర్సన్ లయన్ జాడి తిరుపతి, 320జి జిల్లా కాబినెట్ సభ్యుడు లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, క్లబ్ కార్యదర్శి లయన్ కప్ప ప్రతాప్ సింగ్, సభ్యులు లయన్ బొల్లంపల్లి నాగరాజా గౌడ్, లయన్ కట్ట సదానందం, లయన్ జక్కుల సత్యనారాయణ, లయన్ పప్పిరెడ్డి దీక్షిత్, సామాజిక కార్యకర్తలు నాతంగారి సత్యనారాయణ, పంచకోటి రజనీకాంత్, శ్రీమతి ముత్యాల శ్రావణి, ఆశ సిబ్బంది ఎస్ ఉమా, ఏ లక్ష్మి, డి రాధ, టి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ జిల్లా కలెక్టరేట్

## వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా





**పోరు తెలంగాణ నెక్కొండ ఆగస్టు 24 :** మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ ఒ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ - 40 ఏళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు గత పి ఆర్ సి లో నిర్ణయించిన రూ.15,600 కాకుండా ఇప్పటికీ జీవో 51 ప్రకారం రూ.9,500 మాత్రమే ఇస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.26,000 కనీస వేతనం, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాల చెల్లింపు, చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఉద్యోగం, దహన సంస్కారాలకు రూ.30వేల సాయం, బకాయి వేతనాల చెల్లింపు చేయాలని డిఆర్ఓ జయలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలోనే రోడ్డు పనులు


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**మహేశ్వరం, ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** హర్షగూడకు త్వరలోనే రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ ఆధ్వర్యంలో రోడ్డు పనుల కోసం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని కలిశారు. గతంలో రోడ్డు వైండింగ్ కావాలని హర్షగూడ గ్రామస్తులు తెలపడంతో రోడ్డు వెడల్పుకు నిధులను మంజూరు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. తర్వాత ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు ఆగిపోయాయని అధికారులతో మాట్లాడి త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి యువకులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాధావత్ రవి నాయక్, మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

సర్పంచ్ దేవేందర్ నాయక్..



**మహేశ్వరం ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** గంగారం గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలిపారు. సోమవారం గంగారంలో గూడ మంగమ్మ మల్లేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాజకీయాలకతీతంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను అందించడమే తన లక్ష్యమని అన్నారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ సెక్రెటరీ మహేష్, వార్డు సభ్యులు మోహన్, రవి, ధర్మ, ఆగమయ్య, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 11 దరఖాస్తులు

ఎంపీడీవో శారదమ్మ..




**మహేశ్వరం, ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 11 దరఖాస్తులు రావడం జరిగిందని ఎంపీడీవో శారదమ్మ తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే సమస్యలపై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చిన్నఅప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**బూర్గంపాడు ఆగస్టు 24 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌ను సోమవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. . అనంతరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన యు ఐకేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసుల వివరాలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు.ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిందితులను



గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్, గాండీవ వంటి



ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు ఎం ప్రసాద్, రామ్మూర్తి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని ఓటర్లకు నోటీసులు వేగవంతం చేయాలి



## సుదర్శన్ రెడ్డి....

**పోరు తెలంగాణ ఆగస్టు 24; కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసుల జారీ వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం



హైదరాబాద్‌లోని కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నోటీసులను బూత్ స్థాయి అధికారుల ద్వారా అందించాలని, నోటీసులో తేదీ, ప్రదేశం, సమయం పేర్కొనాలని, వివరాలను ఓటర్లకు 48 గంటల ముందే తెలియజేయాలని సూచించారు. ఈ నెల 27న గ్రామ/వార్డు సభలు నిర్వహించి ఓటరు జాబితా వివరాలు చదివి వినిపించాలని, బూత్ స్థాయి అధికారుల ఖాళీల భర్తీకి నివేదిక అందించాలని, ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు సమావేశంలో పాల్గొన్నారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని ఓటర్లకు నిర్దిష్ట సమయంలో నోటీసులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి బుధవారం డివిజన్ స్థాయిలో, గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ తెలియజేశారు. ఈ నెల 27న గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించి ఓటర్ల జాబితా చదివి వినిపించడంతో పాటు ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం





**పోరు తెలంగాణ,మంచిర్యాల,ఆగస్టు 24 :** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు ఒకటి, పంచాయతీ రాజ్ శాఖకు ఒకటి మరియు నీటి పారుదల శాఖకు ఒకటి చొప్పున మొత్తంగా (03) ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీ శ్రీపతి బాపు రావు గారు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

# పరామర్శ

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తీర్థాల కుమార్ తల్లి రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దాసరి



మనోహర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రాజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వీరి వెంట గ్రామ అధ్యక్షులు పోలోజు రమేష్, బుధే కుమార్, నాగపురి పైడిరాజు,చింతం వెంకటస్వామి,మొగిలి, శ్రవణ్, నాయకులు ఉన్నారు..

# జ్వరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.తుకారం రాథోడ్



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 24(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పాల్వంచ మండల లోని ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల జ్వరంతో మరణం సంభవించిన నేపథ్యంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.తుకారం రాథోడ్ తుమ్మలగూడెం పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య శిబిరం, ఏఎల్ఓ, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. జ్వర కేసులపై ఇంటింటి సర్వే నిర్వహించి, తీవ్ర కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. స్వల్ప జ్వర కేసులను ప్రతి నాలుగు గంటలకు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఏఎల్ఓ, డ్రై డే కార్యక్రమాలను ప్రతిరోజూ నిర్వహించడంతో పాటు గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జ్వరాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు.

# దశల వారిగా అభివృద్ధి పనులు

## సర్పంచ్ మునగపాటి నవీన్..

**మహేశ్వరం, ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ తెలిపారు. సోమవారం 8 లక్షలతో జిపి జిఎఫ్ నిధులతో సిసి రోడ్డు, ఐదు లక్షలు వి బి



జి రామ్ జి నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో పెండింగ్ పనులను దశలవారీగా చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామంలో రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, డ్రైనేజీ, పారిశుధ్య పై ప్రత్యేక దృష్టిని సారించినట్లు ఆయన వివరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జోరల రమేష్ వార్డు సభ్యులు బేబీ, సునీత, కిష్టమ్మ, సంజీవ, ఎస్. కే ఆజాం, స్వాతి, శాలిని, పరమేష్, శ్రీశైలం, వీరిబాబు, స్వప్న, రూకేష్, చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి సుజాత, మాజీ సర్పంచ్ ఆనందం, నాయకులు చంద్రయ్య ముదిరాజ్, కృష్ణ, బీరప్ప, అంజయ్య, నరేందర్, సిద్ధార్థ్ ,రవి పాల్గొన్నారు.

# జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎన్‌సీఎస్‌టీ సభ్యుడు జాతోత్ హుస్సేన్‌కు కలెక్టర్ అంకిత్ ఘన స్వాగతం



**కొత్తగూడెం ఆగస్టు 24 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : జిల్లా పర్యటనకు విచ్చేసిన నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ( సభ్యులు జాతోత్ హుస్సేన్‌కు సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి సభ్యులను సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గిరిజనులకు మెరుగైన మౌలిక వసతులు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అందిస్తున్న సేవలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల మహా ధర్నా ను విజయవంతం చేయండి





**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 24 :** రాష్ట్ర టీజీఈ జేఏసీ పిలుపు మేరకు తేది. 27/08/2026 న ఐ డి ఓ సి నస్పూర్, నందు నిర్వహించనున్న మహా ధర్నా, నిరసన కార్యక్రమంనకు పెద్దఎత్తున ఉద్యోగస్తులు హాజరుకావాలని టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ వనజా రెడ్డి, టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీపతి బాపు రావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో కార్యాలయ సూపర్ డెంట్ భాగ్యలక్ష్మి,ఏ ఈ రాజకుమార్ ,మెడికల్ ఆఫీసర్ డా.శ్రావ్య ,వెటర్నిటీ డా. వెంకటేష్ , ఏ ఈ రాజమల్లయ్య, అగ్రికల్చర్ ఎ ఓ సయిదా ,హాస్టల్ వార్డెన్ మల్లేష్ ,అంగన్వాడీ సూపర్ వైజర్ గాయత్రి, హోసింగ్ ఏ ఈ కాంక్ష ఐకేపీ ఏపీఎం సంతోష్ మరియు పంచాయతీ కార్యదర్శులు ఏ. సత్యనారాయణ, పి. సురేష్,బి. ఉదయ్ కుమార్,విష్ణువర్ధన్, ఐ. తిరుపతి మరియు ఏ. రమాదేవి పాల్గొన్నారు

# మోతేలోని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్స్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ డోల రమేష్ రెడ్డి

**పోరు తెలంగాణ : (చాట్ల జీతేంద్ర, వేల్పూర్ ) :** వేల్పూర్ మండలం మోతే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్త కంప్యూటర్స్ ను సోమవారం గ్రామ సర్పంచ్ దోల్ల రమేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పిల్లలు సంఖ్య ఎక్కువ కావడంతో కంప్యూటర్స్ ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్య కమిటీ సభ్యులు దమ్మాయి గంగారెడ్డి, రాచర్ల ప్రవీణ్, అరవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా శాంతి కమిటీ సమావేశం



**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగష్టు 24 :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి చెన్నూర్ ఎస్సై శ్యామ్ పటేల్ తో కలిసి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమక్షంలో శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో చెన్నూర్ జామా మసీదు ఇమామ్ సర్ఫరాజ్ నూరి, ఆర్గనైజర్ ఫసీ ఉద్దీన్, 17వ వార్డు కౌన్సిలర్ అజీముద్దీన్, ఎ ఎం సి డైరెక్టర్ ఎం.డి. జైనుల్ అబీదీన్ పాల్గొన్నారు. మిలాద్-ఉన్-నబీ వేడుకలు మరియు ఊరేగింపును శాంతియుతంగా, సోదరభావంతో, అన్ని వర్గాల సమన్వయంతో నిర్వహించేందుకు పోలీసు అధికారులు మరియు కమిటీ సభ్యులు చర్చించారు.

# ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా:: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్





**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి జూలూరుపాడు మండల బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికినారు.ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ ఈ జిల్లాలో గిరిజన సమస్యలు అధికంగా ఉన్నవి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నాను.ఈ ప్రాంతంలో ఎటువంటి సమస్యలు ఉన్న రాతపూర్వకంగా ఇచ్చినచో పరిష్కారానికి కృషి చేస్తాను. ప్రజలకు సమస్యలు వచ్చినా నేరుగా రాతపూర్వకంగా నన్ను కలవచ్చు అన్నారు.అనంతరం ఎలమంద నివాసంలో బిజెపి మండల అధ్యక్షుడు భూక్య రమేష్ ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని తీసుకున్నారు.అనంతరం వివిధ సమస్యల పై వినతి పత్రాలు తీసుకున్నారు.ప్రతి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ రాథోడ్,బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్,బిజెపి మండల అధ్యక్షుడు భూక్య రమేష్,సిరిపురపు ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శులు భూక్య శ్రీను,నిమ్మటూరు రామారావు,ధారావత్ బాలకిషన్,గుగులోతు రాంబాబు,భూక్య చరణ్,బాబూలాల్,భూక్య రవి,కిష్టం శెట్టి గోపాలరావు,నవీన్,పృథ్వి,వందనపు సుబ్బు మరియు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**అశ్వాపురం ఆగస్టు 24 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** అశ్వాపురం మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై సమీక్షించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ఓదెల ప్రజావాణి

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఓదెల మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నారు ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో అనిల్ రెడ్డి నోడల అధికారిగా



వ్యవహరించారు ఈ కార్యక్రమానికి తాసిల్దార్ వనజ నాయక్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజావాణిలో హౌసింగ్ 3, విద్యుత్తు 2, అటవీ శాఖ 1, ఎంపీడీవో 2 సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని వాటికి సంబంధించిన తాసిల్దారు వెంట వెంటనే వారి గ్రామ రికార్డులను పరిశీలించి సమస్య ను పరిశీలిస్తామన్నారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను నమోదు చేసుకొని దరఖాస్తుదారులకు రసీదు కూడా అందజేశామని తెలిపారు వీటిని త్వరలో పరిశీలిస్తామని పేర్కొన్నారు ప్రజావాణిలో ఏ శాఖకు సంబంధించిన దరఖాస్తు ఆయా శాఖల అధికారుల కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్, విద్యాధికారి రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బోనాలకు రావాలని
# బండి సంజయ్ కు ఆహ్వానం



**మహేశ్వరం, ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** రావిరాలలో సెప్టెంబర్ 1న అంబోజి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే సూర్యగిరి రేణుక ఎల్లమ్మ బోనాలు, ఘటం కార్యక్రమానికి రావాలని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోం సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటేకార్ మధు మోహన్, మాజీ కౌన్సిలర్ బోద యాదగిరి రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకాలంలో
# పౌష్టికాహారం అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 24, 2026:** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలను
# నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ







**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 24, 2026:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం -2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి, హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం- 2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయామని, ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించబడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని, పశువులు, జంతువుల నుండి కాపాడేందుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని, దేవాలయాల ప్రాంగణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం-2026 లో భాగంగా 41 లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 27 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్తగూడెంలో జరిగే ఓటర్ల జాబితా
# సవరణ ఫేజ్ 2 ట్రైనింగ్ క్యాంపులో విధిగా హాజరు కావాలి

డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

పి.సి.సి. సర్ ఇంచార్జి లింగోజితో కలిసి పాల్వంచ

బి.ఎల్.ఎ.ల సమావేశంలో పాల్గొన్న కొత్వాల

బి.ఎల్.ఎ.లకు ఓటరు లిస్టులు పంపిణీ చేసిన

లింగోజి, కొత్వాల .





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 24(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** కొత్తగూడెం విద్యానగర్ కాలని లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం బి.ఎల్.ఎ.లకు, సూపర్ వైజర్ లకు మండల, పట్టణ, కాంగ్రెస్ అధ్యక్షుల కు జిల్లా పార్టీ నాయకులు,కార్పొరేటర్లకు, పంచాయతీ సర్పంచ్‌లకు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకుల కు ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్,రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీ లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీకి,చెందిన బి.ఎల్.ఎలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి.సి.సి. సర్ ఇన్‌ఛార్జ్, కో-ఆర్డినేటర్ ఎం లింగోజీ, కొత్వాల ఓటర్ జాబితా సవరణ సర్ - 2 పై దిశా నిర్దేశం చేశారు. బి.ఎల్.ఎల కు, సూపర్‌వైజర్ల కు కొత్త ఓటర్ లిస్ట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఓటర్ నమోదులో సర్ ఫేజ్ - 2 కీలకమైనదని, బి.ఎల్.ఎలు కీలకంగా వ్యవహరించాలన్నారు. మంగళవారం జరిగే ప్రత్యేక ట్రైనింగ్ క్యాంప్ లో అందరూ విధిగా పాల్గొనాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి భువనసుందర్ రెడ్డి, బి.ఎల్.ఎలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## నోటీసులు జారీ చేసే సమయంలోనే
# అవసరమైన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా


అదనపు కలెక్టర్ వేణుగోపాల్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం అవసరమైన ఓటర్లను విచారణకు పిలిపించి, సంబంధిత పత్రాలు, ఆధారాలను పరిశీలించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు ఎలాంటి సందేహాలు లేకుండా ప్రక్రియను వివరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు,ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో గ్రామ/వార్డు సభలు నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 24, 2026:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, నోటీసులను సంబంధిత ఓటర్లకు 3 రోజులలోగా అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రకారం గ్రామ/వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎ.ఈ.ఆర్.ఓ ల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 24, 2026:** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నెపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ టు చెందిన ఎం.ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, భూమి కాగితాలు, ఖరీదైన వస్తువులు, మంచాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని, తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ను
## వెంటనే విడుదల చేయండి



**పోరు తెలంగాణ,పెద్దపల్లి, ఆగస్టు 24 :** పెండింగ్లో ఉన్న 15 వేల కోట్ల ఫీజు రియింబర్స్మెంట్ , స్కాలర్ షిప్ లను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజేపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ రాక పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**పోరు తెలంగాణ,పెద్దపల్లిఆగస్టు 24 :** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్‌ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద లిఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలనిలితెలిపారు.గ్రామ సభ,వార్డు సభలో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు




జాబితాలో పేరు నమోదు చేసుకునేలాలి అవగాహన కల్పించాలని తెలిపారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలని అన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య లికనీసం 7 రోజుల వ్యవధిలిఉండేలా చూడాలని సూచించారు.నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను సక్రమంగా డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంకా సుమారు 10 వేల నోటీసులు జనరేట్ చేయాల్సి ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సభలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, డ్రాఫ్ట్ ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై వివరించినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య,,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీస్ కమిటీ సమావేశం నిర్వహించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ

## మీలాద్-ఉన్-నబీ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సూచనలు

**పోరు తెలంగాణ, రామగుండం ఆగస్టు 24 :** మీలాద్-ఉన్-నబీ (ఈద్-ఎ-మిలాద్) పండుగను పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధ్యక్షతన కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు,మత పెద్దలతో సీపీ చర్చించారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. జూలూసులు, ర్యాలీలు నిర్వహించే సందర్భంలో ముందస్తు అనుమతులు తీసుకుని, నిర్ణయించిన మార్గాల్లో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ర్యాలీలు,జూలూసుల సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను నియమించుకోవాలని తెలిపారు. అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు,ఇతర పరికరాలను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించకూడదని సూచించారు. చిన్నారులు,వృద్ధులు, విద్యార్థులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ప్రసంగాలు, పాటలు,నినాదాలకు దూరంగా ఉండాలని, ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని కోరారు. యువత ముఖ్యంగా శాంతి,క్రమశిక్షణతో వ్యవహరించి ఎలాంటి గొడవలు,వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.పండుగ కార్యక్రమాల సమయంలో మహిళలు,చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని





తెలిపారు.ర్యాలీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పండుగ సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు.కొంతమంది సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు,పుకార్లు సృష్టించే అవకాశం ఉందని,ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అటువంటి పోస్టులను చూసి సంయమనం పాటించాలని కోరారు. ఏదైనా సమాచారం నిజమా,కాదా అనే విషయాన్ని స్థానిక పోలీసులను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్ 112, కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి,మత ఘర్షణలు జరిగేలా లేదా శాంతిభద్రతల సమస్యలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని మతాలకు సంబంధించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, నిరంతరం నిఘా ఉంచాలని,ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకునేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. శాంతి,సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతో మీలాద్-ఉన్-నబీ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,రామగుండం సీఐ కృష్ణ కుమార్, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్,ఆర్ఐ రమేష్, పెద్దపల్లి ఎస్ఐ నరేష్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్,చెన్నూర్ టౌన్ ఎస్ఐ శ్యామ్ పటేల్,మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్- 19 కేజీల గంజాయి స్వాధీనంలికరిన చర్యలు తప్పవు

## భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్

**భద్రాచలం ఆగస్టు 24 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం డీఎస్పీ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణ ఎస్సై వి. సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారంరాత్రి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ ఏ అజయ్ సైని, ఉజ్వల్ ఏ ఉజ్వల్ సైనిగా గుర్తించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మహమ్మద్ అష్రఫ్ ఖురేషి అనే వ్యక్తి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను ఉంచి, బెంగళూరులోని సతీష్ అనే వ్యక్తికి అందజేయాలని సూచించినట్లు నిందితులు తెలిపారు. దీంతో వారు సుకుమ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని, బెంగళూరు వెళ్లేందుకు



బస్సు కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 19 కేజీల గంజాయి, దీని విలువ సుమారు రూ.9,41,500/-, అలాగే రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ యం. నాగరాజు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ మాట్లాడుతూ, యువత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి పాల్పడే వారితో పాటు అక్రమ రవాణాకు సహకరించే వ్యక్తులపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం, రవాణా, నిల్వకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి ఆదేశం

**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిర్పూర్ (టి) మండలానికి చెందిన షకీల్ హుస్సేన్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ సప్లై బిల్లుల చెల్లింపు కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం దూరాతండా గ్రామస్తులు తమ గ్రామ ఆశా కార్యకర్తను తొలగించాలని కోరారు. రెబ్బెన మండలం గోనేటి గ్రామ రైతులు తమ ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో వేసిన బోర్లకు విద్యుత్ సరఫరా కోరారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన మసాడె అరుణ్ తన కుమారుడికి గురుకుల విద్యాలయంలో సీటు కోరారు. దహేగాం మండలం కమ్మరపల్లికి చెందిన జరుపుల సురేష్ తండ్రి పేరిట గల భూమిని తన పేరిట వారసత్వ మార్పిడి కోరారు. పెంచికలపేట మండలం గుండెపల్లికి చెందిన తలండి ముత్తుబాయి తాము సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు.



# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీడీ

## వసతి గృహంలో సౌకర్యాల పరిశీలన....

## విద్యార్థుల సమస్యలపై ఆరా....



**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ రాత్రి సమయంలో సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, విద్యా సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వసతి గృహ పరిసరాలు, గదులు, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రతను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చదువు, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తమ సమస్యలను డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు.

# వన మహోత్సవం లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

## మంత్రి కొండా సురేఖ....




**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి పీసీసీఎఫ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026-27 సీజన్‌లో జిల్లాలకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి సంరక్షించాలని, బృహత్ పల్లె వనాల్లో మొక్కలు పెంచాలని మంత్రి సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాకు కేటాయించిన 47 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని అధికారుల సమన్వయంతో త్వరలో పూర్తి చేస్తామని, ప్రభుత్వ స్థలాలు, రహదారికి ఇరువైపులా, చెరువుగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలియజేశారు.

# ప్రజలతోనే నా ప్రయాణం

## మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప.....



**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా బారేగుడ గ్రామంలో మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప పర్యటించారు. గ్రామస్థులు, యువకులతో సమావేశమై అందరినీ ఆప్యాయంగా పలకరించారు. తన కుటుంబం మొత్తం ప్రజాసేవలో భాగస్వామ్యమవుతూ ప్రజలతోనే ఉంటున్నామని, నిత్య అన్నదాన సత్రంలో ప్రతిరోజూ రుచికరమైన భోజనం అందిస్తున్నామని కోనేరు కోనప్ప తెలియజేశారు. సిర్పూర్ నియోజకవర్గంలో మూడుసార్లు ఆశీర్వదించి అవకాశమిచ్చిన ప్రజల మేలు ఎప్పటికీ మరవనని, కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, అబ్దుల్ రసీద్, సందీప్, జమ్నాజి, దేవిధాస్, ధనుంజయ్, ఎర్రన్న, గణపతి, బాపురావు, శ్రీనివాస్, వెంకటేశ్, కిరణ్, గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నవారు

# బ్యాగ్స్ , నోట్ బుక్స్ అందజేత

## సర్పంచ్ కనికి రెడ్డి సతీష్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఆగస్టు 24 సోమవారం ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ లో రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యార్థిని, విద్యార్థులకు బ్యాగ్స్ బూట్లు , నోట్ బుక్స్ స్థానిక సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మీదుగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి





**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 24 :** పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ చెన్నూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు గారు ఫీజు రియంబర్స్మెంట్ తక్షణం విడుదల చేయాలని కోరుతూ తలుపెట్టిన రెండు రోజుల దీక్ష కు అనుమతినివ్వకపోవడం ముమ్మాటికి ప్రజాస్వామ్య విలువలను కాయల కాలరాయడమేనని అందుకే వినతి పత్రాన్ని అంబేద్కర్కు అందజేశామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గర్రెపల్లి శాంతా వెంకట నరసయ్య పట్టణ ప్రధాన కార్యదర్శిలు కాగిత వెంకటేష్ మానికరావుతు శంకర్ అడప శ్రీనివాస్ తుమ్మ చిరంజీవి కోత్తూరు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు....

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ రంజిత్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండలం పోత్కాపల్లి ఆటో స్టాండ్ దగ్గర రాయపేట గ్రామానికి చెందిన రైతు తన యొక్క బ్యాంక్ పాస్ బుక్ ఆధార్ కార్డు ఏ టీ మ్ కార్డు , తన యొక్క విలువైన పత్రాలను మర్చిపోయాడు. అది గమనించిన ఆటో డ్రైవర్ సొల్లు రంజిత్ అతడి యొక్క ఆధార్ కార్డు తో వారి గ్రామానికి ఫోన్ చేసి అతడి ఫోన్ నెంబర్ తెలుసుకుని వారికి తిరిగి అందించడం జరిగింది. ఆ రైతు సంతోషం తో డ్రైవర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# బెల్ట్ షాపులు తొలగించాలంటూ మహిళల ఆందోళన




**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలు రోడ్డెక్కారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం దుర్గా నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని విలేజ్ నంబర్--5లో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుల కారణంగా కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాల వల్ల కుటుంబాల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని, సంపాదించిన డబ్బు మద్యం కోసం ఖర్చు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బెల్ట్ షాపుల వల్ల మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టి, బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని మహిళలు డిమాండ్ చేశారు. గ్రామాల్లో మద్యం అందుబాటును తగ్గించడంతో పాటు అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మహిళలు ఇస్గాం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై నరేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుని తమ కుటుంబాలను కాపాడాలని వారు కోరారు. మహిళల ఫిర్యాదుపై పోలీసులు స్పందించి అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. బెల్ట్ షాపులు తొలగించి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని మహిళలు స్పష్టం చేశారు. ఫిర్యాదుకు ఎస్సై నరేష్ సానుకూలంగా స్పందించారు.

# సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయని కాగజ్ నగర్ తాసిల్దార్ కార్యాలయం

ఇప్పటికైనా సమాచార హక్కు చట్టం 2005 బోర్డు ఏర్పాటు చేయాలి...

ఆర్టీ ఐ సహా రక్షణ చట్టం జిల్లా, మండలం కమిటీ సభ్యుల డిమాండ్.








**పోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం--2005పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా జిల్లా, మండల స్థాయిలో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ తాసిల్దార్ కు నవంబర్ 20 తేదీ 2025 రోజున వినతిపత్రం అందజేశారు. పెయింటింగ్ చేపించాము బోర్డులు ఏర్పాటు చేసేందుకు రెండు రోజులలో ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు బోర్డులు ఏర్పాటు చేయలేదని వినతిదారులు తెలిపారు. సమాచార హక్కు చట్టం బోర్డు పెట్టడం కోసం ఇంకా ఎన్ని రోజులు పడుతుంది. ఇంత నిర్లక్ష్యం ఎందుకని విమర్శించారు.సమాచారం హక్కు చట్టం--2005పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత సమాచారంతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. గడువు ముగిసినా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా, మండలం ఆర్టీ ఐ సహా రక్షణ జిల్లా మరియు మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు..

# అటవీ భూమి ఆక్రమణను అడ్డుకున్న అధికారిపై దాడి



**ఫోరు తెలంగాణ ఆగస్టు 24: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం సిర్పూర్ అటవీ రేంజ్ పరిధిలోని ముత్తంపేట్ సెక్షన్ ఆఫీసర్ అజరుద్దీన్‌పై దాడి జరిగింది. సోమవారం గస్తీలో భాగంగా అటవీ ప్రాంతంలో పరిశీలన చేస్తుండగా, కనికి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ ట్రాక్టర్‌తో అటవీ భూమిని అక్రమంగా దున్నే ప్రయత్నం చేశాడు. అక్రమణను వెంటనే నిలిపివేయాలని అజరుద్దీన్ వారించగా, ఆగ్రహించిన శ్రీనివాస్ అతనిపై దాడి చేశాడు. ఈ ఘటనపై అజరుద్దీన్ కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అధికారులపై దాడులను సహించేది లేదని కాగజ్‌నగర్ ఎఫ్డీఓ భార్గవ్ స్పష్టం చేశారు.

# గర్భిణీలు ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను తీసుకోకూడదు లేదంటే బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం



గర్భం దాల్చిన మహిళలు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాలన్న విషయం అందరికీ తెలిసిందే. వారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆ ఆహారం శిశువు ఎదుగుదలకు, పుట్టుక లోపాలు రాకుండా ఉండేందుకు సహాయం చేయాలి. అలాంటి ఆహారాన్నే గర్భిణీలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వారి ఆహారంపై వైద్యులు, పోషకాహార నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అయితే గర్భిణీలు కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం పూర్తిగా మానేయాలి. లేదంటే శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. పుట్టుక లోపాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. గర్భిణీలు ఏ ఆహారం తీసుకోవాలనుకున్నా డాక్టర్ సలహా పాటిస్తే ఉత్తమం. లేదా పోషకాహార నిపుణులను సైతం సంప్రదించవచ్చు.

**రెడీ టు ఈట్ ఫుడ్స్..**

గర్భిణీలు ఎట్టి పరిస్థితిలోనూ రెడీ టు ఈట్ ఫుడ్స్‌ను అసలు తినకూడదు. తింటే వారికి పుట్టబోయే పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. రెడీ టు ఈట్ ఫుడ్ అంటే ప్యాక్‌లో ఉండే ఆహారాలకు కొద్దిగా నీళ్లు కలిపి లేదా వేడి చేసి లేదా నూనె కలిపి వండేవి అన్నమాట. అలాంటి ఆహారాలను కేవలం కొన్ని నిమిషాల్లోనే వండవచ్చు. అలాంటి ఆహారాలనే తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక గర్భిణీలు చేపలు, రొయ్యలను తినడం మానేయాలి.

# పత్తి రైతు మెడకు సీసీఐ కొత్త ఉరి



రైతును రాజును చేస్తామని, అన్నదాతల వల్లనే దేశం సుభిక్షంగా ఉందని మన దేశంలో పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. కానీ,వాస్తవికంగా రైతుల సంక్షేమం విషయానికి వచ్చేటప్పటికి పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. రైతులకు మేలు కలిగించే పథకాలను, ఆలోచనలను అమలు చేయడానికి ఏండ్లకేండ్లు కాలయాపన చేసే ప్రభుత్వాలు.. ఆంక్షలు, కొర్రీల విషయంలో మాత్రం క్షణకాలంపాటు కూడా ఆలోచించడం లేదు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇటీవల తీసుకువచ్చిన కొత్త నిబంధనలే అందుకు తాజా నిదర్శనం. పత్తి కొనుగోళ్ల విషయంలో నూతన నిబంధనలు తీసుకురావడానికి సీసీఐ చెప్పిన కారణం అత్యంత హాస్యాస్పదంగా, అసహ్యంగా నూ తోస్తున్నది. పత్తి కొనుగోళ్లలో జిన్నింగ్ మిల్లు లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాయని, వాటిని అరికట్టడానికే నూతన నియమాలు, నిబంధనలను తీసుకొచ్చినట్టు సీసీఐ చెప్తున్నది. తప్పొకరు చేస్తే శిక్ష మరొకరికి వేసినట్టుగా ఉన్నది సీసీఐ తీరు. మన దేశంలో పత్తి కొనుగోళ్లు, పత్తికి మద్దతు ధర కల్పించడం, ధరల స్థిరత్వం, పత్తి పరిశ్రమలను బలోపేతం చేయడం కోసం 1970లలో భారత ప్రభుత్వం సీసీఐని ఏర్పాటు చేసింది. రైతులకు మేలు చేయడానికే దీన్ని స్థాపించారని అందరూ భావిస్తారు. కానీ, వాస్తవానికి ఆ సంస్థ ఎన్నడూ రైతులకు లాభం చేకూర్చే పనికి నిజాయితీగా పూనుకోలేదు. తద్విరుద్ధంగా రైతులకు నష్టాలు చేసే ప్రతిపాదనలనే ఎక్కువసార్లు ప్రవేశపెట్టి రైతుల నడ్డి విరగ్గొడుతున్నది. ప్రభుత్వాలు తప్పించుకోవడానికి, తమపై నిందరాకుండా చూసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఓ అధికార దళారి వ్యవస్థనే ఈ సంస్థ.


జూలైలో 2025-26 (అక్టోబర్ %-% సెప్టెంబర్) సీజన్ కోసం పత్తి పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని ఇటీవల సీసీఐ ప్రకటించింది. వివిధ రకాలుగా పత్తి నాణ్యతను వర్గీకరించి మద్దతు ధరలను నిర్ణయించింది. దీంట్లో ప్రధానంగా మీడియం స్టాప్ కాటన్‌కు క్వింటాలుకు రూ.7,710, లాంగ్ స్టాప్ కాటన్‌కు రూ.8,110 మద్దతు ధరను ప్రకటించింది. అయితే, గతంలో ఒక ఎకరాకు 12 క్వింటాల కంటే ఎక్కువ పత్తిని కొనుగోలు చేయలేమని చెప్పిన సీసీఐ.. ఇప్పుడు తీరా మార్కెట్లకు పత్తి చేరుకుంటున్న సమయంలో ఏకంగా ఎకరాకు ఏడు క్వింటాళ్లకు మించి పత్తి కొనుగోలు చేయబోమని కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. జిన్నింగ్ మిల్లుల అవినీతి కథ చెప్తూ రైతుల మెడకు ఉరితాళ్లు పేనుతున్నది. అంతేకాదు, పత్తిలో 8 లేదా అంతకంటే తక్కువ శాతం తేమ ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని అంటున్నది. లేదంటే తక్కువ ధర వస్తుందని సెలవిచ్చింది. ఈ నిబంధనలను సమర్థించుకోడానికి సీసీఐ కొత్త పాట పాడుతున్నది. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ప్రకారం.. రైతుల దగ్గర మిల్లర్లు తక్కువ ధరకు పత్తి కొని, సీసీఐకి ఎక్కువ ధరకు అమ్మి లాభాలు గడిస్తున్నాయని సాకులు చెప్తున్నది. సగటున ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వస్తుందని, అందుకే ఆ పరిమితి పెట్టామని అంటున్నది. నిజానికి ఒక ఎకరాకు సగటున 8-12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. కరువు ప్రభావిత లేదా అధిక వరద ప్రభావిత ప్రాంతాల్లో 6-8 క్వింటాళ్ల సగటు దిగుబడి వస్తుందనేది రైతులు, వ్యవసాయ నిపుణుల మాట. నిజానికి సీసీఐ చెప్పిందే నిజమనుకుంటే, నిన్నమొన్నటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోలు చేస్తామని ఎట్లా చెప్పింది? జిన్నింగ్ మిల్లులను కట్టడి చేయడానికి కాదు, రైతులను ముంచడానికే ఈ నిబంధనలు తెచ్చినట్టు తెలుస్తూనే ఉన్నది. జిన్నింగ్ మిల్లుల వద్ద అవినీతి, అక్రమాలు జరగకుండా పర్యవేక్షించడం సీసీఐకి పెద్ద కష్టమేమీ కాదు. ప్రభుత్వం తలుచుకుంటే రైతులు తమ ఉత్పత్తులను అమ్మిన ప్రతీచోట మద్దతు ధర పొందేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు. జిన్నింగ్ మిల్లులు, దళారుల వల్ల అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనుకుంటే నేరుగా అవి కొనకుండా అడ్డుకోవాలి. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ఐకేపీ) ఏర్పాటు చేసినట్టు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా రైతులకు లాభం జరుగుతుంది. అవినీతి కూడా కట్టడవుతుంది. ఇవన్నీ చేయడం చేతకాక, రైతులకు మంచి చేయడం ఇష్టం లేక సీసీఐ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది. ఇంకొక కొత్త సమస్యను రైతుల మెడకు కట్టింది సీసీఐ. అది 'కపాస్ కిసాన్' యాప్. ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నవారే పత్తి అమ్ముకోగలరు. అది కూడా రైతులు ఏ రోజు అమ్ముకోవాలని ముందుగా చెప్తే, ఆ రోజే పత్తి కొంటారు. కానీ రైతు లు తమ వీలును బట్టి తీసుకుపోతే కొనరనే కొర్రీ రైతులకు ఏ విధంగా లాభదాయకమో సీసీఐ సమాధానం చెప్పాలి? అకాల వర్షాలతో నిండా రైతులను ముంచే వాతావరణం కలిగిన ఈ దేశంలో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేయడమంటే సాహసమే కాదు, ప్రాణాలను పణంగా పెట్టడం కూడా. అటువంటిది రైతులు తాము అనుకున్న రోజు పత్తిని అమ్ముకునే అవకాశం కూడా లేకపోవ డం శోచనీయం. ఆ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రోజునే పత్తి కొంటామని సీసీఐ అంటున్నది. ఒకవేళ స్లాట్ బుక్ చేసుకున్న రోజున హఠాత్తుగా వర్షం పడితే ఎటుపోవాలి? నూటికి 90 శాతం నిరక్షరాస్యులైన రైతులు యాప్ ద్వారానే తమ ఉత్పత్తులను అమ్మాలంటే ఎట్లా సాధ్యమవుతుంది?

అయితే, ఇందులో అత్యంత అన్యాయానికి గురవుతున్నది కౌలు రైతులే. వ్యవసాయదారుల్లో నూటికి 50 శాతం ఉన్న వీరిని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. కౌలు రైతులు వారి పంటలను ఎట్లా అమ్ముకోవాలి? భూ యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వీరికి మద్దతు ధర కూడా అందట్లేదు. నకిలీ విత్తనాల వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కల్తీ పురుగుమందుల వల్ల దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోతున్నా సదరు కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు. మేలైన పత్తి విత్తనం గురించి రైతులకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఎలాంటి విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడి వస్తుందన్న శిక్షణ ఇవ్వడం లేదు. కానీ, తాము చెప్పిన ప్రమాణాలతో లేకుంటే పత్తి కొనుగోలు చెయ్యబోమని, మద్దతు ధరలు ఇవ్వబోమని నిబంధనలు మాత్రం తీసుకొస్తున్నది. దేశంలోని వాతావరణ పరిస్థితులు పాలకులకు పట్టవు. వాతావరణం వల్ల దెబ్బతిన్న పంటలు, రైతుల కష్టాలు వారికి కనపడవు. కానీ, మేలైన పతి కే మద్దతు ధర ఇస్తామంటారు. అసలు సీసీఐ ఉన్న ది రైతుల కోసమా లేకా దళారీల కోసమా, కార్పొరే ట్ శక్తుల కోసమా? సమాధానం చెప్పాలి. ఇటీవల తెలంగాణలో అకాల వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పత్తి ఆగమైంది. ఇలాంటి పరిస్థితుల్లో 8 శాతం తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తామంటే ఎలా? ఇప్పుడు ఆ పత్తి రైతులంతా విధిలేక అగ్గువసగ్గువకు దళారీలకు అమ్ముకోక తప్పని పరిస్థితి కల్పించింది ఈ సీసీఐ కాదా? సీసీఐని ముందుపెట్టి పత్తి రైతులతో ప్రభుత్వాలు ఆడుతున్న నాటకమే ఇదంతా. పెద్ద పెద్ద కాటన్ పరిశ్రమలకు లాభాలు చేకూర్చేందుకు చేస్తున్న ఉపాయాలే ఇవి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిజానికి పత్తి పరిశ్రమను బలోపేతం చేయడానికే ఉద్దేశించినదైతే, అది ముందుగా బలోపేతం చేయాల్సింది పత్తి రైతులను. అందుకు నిత్యం నూతనంగా వస్తున్న మార్పులను రైతులకు వివరించాలి. వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాలు ఏవో ప్రచారం చేయాలి. ప్రకృతి ప్రకోపించినప్పుడు తేమ తదితర విషయాలను పక్కనపెట్టి కొనుగోళు చేయాలి. తద్వారా రైతు నష్టాలపాలు కాకుండా చూడాలి. రైతుకి స్థిరంగా మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే పత్తి పరిశ్రమను బలోపేతం చేసినట్టు అవుతుంది.

ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏమీ ఎరుగనట్టు గమ్మునుండటం విషాదకరం. కార్పొరేట్ కంపెనీలకు నష్టాలు వచ్చాయని, కట్టలేని స్థితిలో ఉన్నాయని ఎంతో ఉదారంగా రూ.వేల కోట్ల రుణాలను రైటాఫ్ చేసే ప్రభుత్వం రైతుల కష్టాల గురించి ఇసుమంతైనా పట్టించుకోకపోవడం పక్షపాత ధోరణికి నిలువుటద్దం. దీన్నిబట్టి పాలకులు పనిచేస్తున్నది ఎవరికోసమో తేటతెల్లమవుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని పత్తి రైతుల మెడలపై పెట్టిన నూతన రూల్స్ కత్తిని తొలగించాలి. ఇందుకు సమాజం మొత్తం ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. లేకుంటే తమ అనుయాయుల కోసం ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు తమ ఇష్టానుసారం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటాయి. సామాన్యుల నెత్తి మీద మోయలేని భారం పడుతూనే ఉంటుంది. పేదలు పరోక్షంగా ధరాఘాతానికి బలవుతూనే ఉంటారు. (వ్యాసకర్త: ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రెటరీ, మానవ హక్కుల వేదిక)

# ఉద్యమ వేదిక.. చైతన్య దీపిక

1893 నుంచి 1945 మధ్య అర్ధ శతాబ్దానికి పైగా సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజ్ తెలంగాణ ప్రజల చైతన్య వేదికగా నిలిచింది. 1862లో ఏర్పాటైన ఈ హైస్కూల్/ కాలేజ్ ప్రాంగణంలోనే జాతీయ స్థాయి సంస్కరణవాదులు, ఉద్యమకారులు,




ఉద్యమ సంస్థల నాయకులు తమ కార్యకలాపాలను ప్రారంభించి, కొనసాగించారు. 1893 ఫిబ్రవరి 13న మహబూబ్ కాలేజీలో స్వామి వివేకానంద జరిపిన మహాసభ, చేసిన ప్రసంగం (మై మిషన్ టు ది వెస్ట్) ఇటు తెలంగాణలోనూ, అటు ఆయన జీవితంలోనూ చేసిన మొదటి చైతన్యపూరిత ప్రసంగం. అంతకుముందు చెన్నపట్నం (చెన్నై) నుంచి రైలులో వస్తూ దారి పొడువునా తెలుగు ప్రజలకు ఆయన దర్శనమిస్తూ వచ్చారు. 1893 ఫిబ్రవరి 9న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జంట నగరవాసులకు కనువిందు చేశారు. రైల్వేస్టేషన్లలో ఆయనకు సుమారు 500 మంది స్వాగతం పలకడం అప్పట్లో అపూర్వ సంఘటన. అలనాటి పురప్రసిద్ధులు రాజా శ్రీనివాసరావు బహదూర్, మహారాజు రంగనాథ బహదూర్, పండిత రతన్‌లాల్, నవాబ్ ఇమామ్‌సింగ్ బహదూర్ మొదలగువారు రైల్వే ప్లాట్‌ఫారం మీద స్వామికి ప్రణమిల్లారు. వివేకానందుడు బసచేసిన అతిథిగృహానికి జనప్రవాహం వెల్లువెత్తింది. ఫిబ్రవరి 17 వరకు సికింద్రాబాద్‌లో స్వామి ఉన్నారు. గోలకొండకు విచ్చేసి వివిధ ప్రాంతాలను ఆయన తిలకించారు. అప్పటి నిజాం మహబూబ్ అలీఖాన్ ప్రాసాదంలో రెండు గంటలు ప్రసంగించారు. హిందుత్వం భారత జాతీయ మౌలికత్వమని, సనాతన సత్యమని వివరించారు. ఆ తర్వాతనే అమెరికా (చికాగో)లో సర్వమత సమ్మేళనంలో వివేకానంద పాల్గొనడం, ఆయన ఉపన్యాసం విని పూర్తిగా వివశులైన అన్ని దేశాల నాయకులు తబ్బిబ్బులైపోయి దీర్ఘ కరతాళ ధ్వనులతో స్వామిజీకి జేజేలు పలికారట. భారత కోకిల, హైదరాబాద్ ముద్దుల కోడలు సరోజినీ నాయుడు విచ్చేసిన సందర్భంలో మహబూబ్ కాలేజీలో ఆమె ఉపన్యాస సభ జరిగింది. 1938లో అంతర్యుద్ధంలో గాయపడినవారికి సేవలందించడానికి బొంబాయి నుంచి చైనాకు వెళ్లిన డాక్టర్ కోట్నీస్ దురదృష్టవశాత్తు వాతావరణ ప్రతికూలతల కారణంగా ప్రాణాలు విడిచారు. 1942లో మహబూబ్ కాలేజీలోనే ఆయన సంస్మరణ సభ జరిగింది. చైనా ఉద్యమ నాయకుడు చాంగ్ కై షేక్ ప్రతినిధిగా మరో ముఖ్య నాయకుడొకరు ఇక్కడికి వచ్చి నివాళులర్పించారు. అంతేకాదు, భారత వైద్య బృందం అందించిన సేవలను కొనియాడారు. 1942 ఆగస్టులో 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. మహాత్ముడి పిలుపుతో ఆగస్టు 9న జంట నగరాల్లో సత్యాగ్రహాలు మొదలయ్యాయి. మొట్టమొదటి బృందంలో వట్టికోట ఆళ్వారుస్వామి, గోపిశెట్టి రాజేశ్వరరావు, నాగం బాబురావు, జంగయ్య, శ్రీకృష్ణ దూబే, కంకర్ల పెంటయ్య, బొలుసాని శ్రీధర్, సినిమా రాజయ్య, ముత్యాల వేంకటేశం సహా 142 మంది యువకులు ఇందులో పాల్గొని చిరునవ్వుతో జైలుకు వెళ్లారు. ఈ ఉద్యమంలో మహబూబ్ కాలేజీ విద్యార్థులు విజృంభించిన తీరును అందరూ ప్రశంసించారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు పోలీసులను కాలేజీ ఆవరణలోకి అనుమతించలేదు. దాంతో విద్యార్థులు బయటికి రాగానే పోలీసులు కసితో చితకబాదారు. అవి రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు కావడంతో యుద్ధ విమానాల దాడి నుంచి రక్షణ కోసం రోడ్లపై గోతులను తవ్వారు. వాటిలో పడేసి విద్యార్థులను పోలీసులు హింసించారు. అయినా వెరవని విద్యార్థులు పోలీసులను గుంతల్లోకి నెట్టి వారిని పరాభవించారు. కొన్ని వారాలపాటు ఈ ఉద్యమం మహోధృతంగా నడిచింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల నుంచి నాలుగు అణాల చొప్పున అపరాధ రుసుము వసూలు చేశారు. రుసుము చెల్లించని విద్యార్థులు బహిష్కరణకు గురయ్యారు. వారి తల్లిదండ్రులకు హెచ్చరికలు పంపించారు. ఈ విధంగా చాలామంది చదువుల్లో వెనకబడిపోయారు. ఎస్.ఆర్.వేంకటేశం, బాబురావు, ఎం.రామయ్య, వి.విశ్వనాథశాస్త్రి, జి.రాజేశ్వరరావు, పి.భాస్కరమూర్తి, సోమ వేంకటేశం, ఎస్.బాలరాం మున్నగువారు ఉద్యమం నడిపినవారిలో ప్రముఖులు. ఈ ఉద్యమాల పర్యవసానంగా 1943లో సికింద్రాబాద్ విద్యార్థి సం ఘం ఏర్పడింది. 1943లో మహబూబ్ కాలేజీలో కోలాహలంగా జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభలలో 'నాజర్' చెప్పిన బుర్రకథలు జనాలను ఉర్రూతలూగించాయి. కామ్రేడ్ వట్టికొండ నాగేశ్వరరావు బృందం కూడా కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్రను బుర్రకథగా చెప్పింది. హిందూ కాలేజీ అధ్యాపకులు, ప్రముఖ గ్రాంథిక భాషావాది జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి ప్రధానోపన్యాసం చేశారు. ఈ సాహిత్య మహాసభలలో ఆటవెలది దత్తాత్రేయశర్మ పంతులు ప్రోత్సాహంతో పాల్గొన్న విద్యార్థులు క్రమంగా బస్తీల్లో యువజన సంఘాలు నెలకొల్పి, అనేక సామాజిక సేవా కార్యకలాపాలు చేపట్టారు. పర్యవసానంగా జంట నగరాల్లో పలు యువజన సంఘాలు, వ్యాయామశాలలు, గ్రంథాలయాలు, భజన మండళ్లు వెలిశాయి. నాటి హైదరాబాద్ రాష్ట్ర విముక్తి ఉద్యమంలో పాలుపంచుకున్నాయి. ఆఫ్రికా ఖండంలో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్న కెన్యా నాయకులు 1945లో మహబూబ్ కాలేజీలో జరిగిన సంఘీభావ సభలో పాల్గొన్నారు. ఆఫ్రికాను పాలిస్తున్న యూరోపియన్ ప్రభుత్వాలు ప్రజలను ఏ విధంగా హింసిస్తున్నాయో, లైంగికదాడులకు పాల్పడుతున్నాయో, అవమానాలకు గురిచేస్తున్నయో, ఆ దౌర్జన్యాల పట్ల అక్కడి ప్రజలు తిరగబడి ఏ విధంగా పోరాటం చేశారో ఆయన వివరించారు. అంతేకాదు, తాము కూడా మహాత్మాగాంధీని ఆదర్శంగా భావించి ఆయన సిద్ధాంతాల ప్రకారమే స్వాతంత్ర్య సమరం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇలా మహబూబ్ కాలేజీ ఎన్నో సంస్కరణలు, చైతన్యాలు, సాహిత్య కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ స్పృహలు, ఉద్యమ కార్యక్రమాల ఆరంభ వికాసాలకు వేదికైందని 'అలనాటి సికింద్రాబాద్ నగర జీవనం ఉద్యమాల చరిత్ర' వేదాంతం విశ్వనాథశాస్త్రి తెలిపారు.